క్లుప్తంగా

కేపీ పాలెం నార్త్‌లో పంటబోదె తవ్వకం పనులు



కేపీ పాలెంలో పంటబోదె తవ్వుతున్న ఉపాధి కూలీలు

మొగల్తూరు: మండలంలోని పంట బోదె తవ్వకం పనులు చురుగ్గా జరుగుతున్నాయి. మొగల్తూరు పంచాయతీలోని నక్కావారిపాలెం, ఇంజేటివారిపాలెం, పాలకమ్మచెరువు తదితర ప్రాంతాలతో పాటు మండలంలోని కేపీ పాలెం నార్త్, సౌత పేరుపాలెం నార్త్,సౌత్ గ్రామాల్లో పంటబోదె పనులు చురుగ్గా సాగుతున్నాయి. శుక్రవారం కేపీ పాలెం నార్త్‌లో చేపట్టిన పనులను జేఈ ఆనంద టీపీ వెంకటేశ్వరరావు పరిశీలించారు. శివారు భూముల్లోని ప్రతి ఎకరాకూ సాగు నీరందేలా పంటబోదె పనులు త్వరతగతిన పూర్తి చేయాలని కూలీలకు సూచించారు.

క్షీరారామలింగేశ్వరుని సన్నిధిలో చండీహోమం



చండీహోమంలో పాల్గొన్న భక్తులు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా చండీహోమం నిర్వహించారు. శుక్రవారం ఆలయ ప్రాంగణంలో భమిడపాటి వెంకన్న బ్రహ్మత్వంలో నిర్వహించిన చండీహోమంలో 32 మంది దంపతులు పాల్గొన్నారు. పూజా కార్యక్రమాలు అనంతరం హోమంలో పాల్గొన్న భక్తులకు స్వామివారి శేషవస్త్రం, జాకెట్ ముక్కలు, ప్రసాదం అందజేశారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి యళ్ల సూర్యనారాయణ హోమం ఏర్పాట్లను పర్యవేక్షించారు.

విశాఖ స్టీల్ ప్లాంట్ ఆస్తుల విక్రయాన్ని నిలిపివేయాలి

భీమవరం : విశాఖ స్టీల్ ప్లాంట్ ఆస్తుల అమ్మకాన్ని తక్షణం నిలుపుదల చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బి బలరామ్ డిమాండ్ చేశారు. భీమవరంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్ ఆస్తులను కేంద్ర ప్రభుత్వం అమ్మకానికి పెట్టి దానిని దెబ్బతీయాలని చూడడం దారుణమన్నారు. కేంద్రం ప్రభుత్వం విశాఖపట్నం, హైదరాబాద్, ముంబై, చెన్నై, పూణెల్లోని విశాఖ స్టీల్‌ప్లాంట్ ఆస్తుల్ని విక్రయించాలనే నిర్ణయం తీసుకున్నట్టుగా ప్రచారం జరుగుతోందన్నారు. విశాఖ ఉక్కు పోరాటాల్లో 32 మంది ప్రాణ త్యాగాల ఫలితం విశాఖ స్టీల్‌ప్లాంట్ అన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ విక్రయానికి వ్యతిరేకంగా ఎంతో కాలంగా ప్రజలు కార్మికులు, ఉద్యోగులు, విద్యార్థులు పోరాటాలు చేస్తున్నారని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కేంద్రంపై ఒత్తిడి తెచ్చి తక్షణం విశాఖ ఉక్కు ఆస్తుల అమ్మకాన్ని నిలిపివేసేలా చర్యలు తీసుకోవాలి బలరామ్ కోరారు.

లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కరించాలి

భీమవరం: పోలీసు అధికారులు, న్యాయవాదులు కోర్టుకు, కక్షిదారులకు మధ్య వారధిగా వ్యవహరించి జాతీయ లోక్ అదాలత్ ప్రాముఖ్యతను కక్షిదారులకు తెలియజేయాలని భీమవరం పోక్సో కోర్టు జడ్జి ఎస్ సోమశేఖర్ అన్నారు. ఈనెల 29న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారం కోసం శుక్రవారం పోక్సో కోర్టులో స్థానిక న్యాయవాదులు, పోలీసు అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ అయ్యేలా కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో సివిల్ జడ్జి బి అప్పలస్వామి, ప్రిన్సిపల్ సివిల్ జడ్జి జి సురేష్‌బాబు, ఒకటవ అదనపు సివిల్ జడ్జి పి హనీషా, 2వ అదనపు సివిల్ జడ్జి డి ధనరాజు, భీమవరం డీఎస్పీ వి.నారాయణస్వామిరెడ్డి, న్యాయవాదులు కె.జ్యోతి, వి.సుబ్బారావు పాల్గొన్నారు.

కాలుష్య కారక పరిశ్రమలు నెలకొల్పవద్దు

భీమవరం: ఆకివీడు సమతానగర్ ప్రాంతంలోని కొల్లేరు 5వ కాంటూరు, నివాస ప్రాంతాల మధ్య నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటుచేస్తున్న ప్లాస్టిక్ కనికల తయారీ కంపెనీ నిలుపుదల చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను ఆ ప్రాంత ప్రజలు కోరారు. శుక్రవారం భీమవరంలోని కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆకివీడు పట్టణానికి చెందిన భైరి ఆంజనేయులు, ఓగిరాల ఏలీయా, డి కల్యాణి, వి శివరామరాజు, దారకొండ వెంకటేష్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి వాటిని కరిగించి ప్లాస్టిక్ కనికలుగా తయారు చేసే క్రమంలో కాలుష్యం వల్ల ఆ ప్రాంతం ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురి కావల్సి వస్తుందని అన్నారు. 5వ కాంటూరుకు ఐదు కిలోమీటర్ల వరకు ఎటువంటి కాలుష్య కారక పరిశ్రమలు పెట్టడానికి అనుమతి లేదన్నారు. దీనికి స్పందించిన కలెక్టర్ సుమిత్‌కుమార్ ఫ్యాక్టరీ నెలకొల్పే ప్రాంతాన్ని పరిశీలించిన తరువాత తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు సమతానగర్ వాసులు చెప్పారు.

యోగాతో మానసిక ప్రశాంతత



పాలకొల్లు సెంట్రల్: విద్యార్థులతో కలిసి యోగా చేస్తున్న ఆర్డీఓ అచ్యుత్ అంబరీష్



నరసాపురం: వైఎన్ కళాశాలలో యోగాసనాలు వేస్తున్న దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: విద్యార్థులు క్రమం తప్పకుండా యోగా చేయడం వల్ల మానసిక ఒత్తిడి తగ్గడంతో పాటు మానసిక ప్రశాంతత కూడా కలుగుతుందని నరసాపురం ఆర్డీఓ డాక్టర్ ఎం.అచ్యుత్ అంబరీష్ అన్నారు. శుక్రవారం స్థానిక భారతీయవిద్యా భవన్స్ పాఠశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులతో కలిసి యోగాసనాలు చేశారు. అనంతరం అంబరీష్ మాట్లాడుతూ మనిషి ఉల్లాసంగా, ఉత్సాహంగా, ఆరోగ్యంగా ఉండాలంటే యోగాను క్రమం తప్పకుండా చేయాలని సూచించారు. కార్యక్రమంలో భవన్స్ డైరెక్టర్ ఎంఎస్ఎన్ మూర్తి, వేగేశ్న రంగరాజు, గాదె జనార్దనగుప్త తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక జీవీఎస్‌వీఆర్ఎం మునిసిపల్ ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం రాయపూడి భవానీప్రసాద్, బీవీఆర్ మునిసిపల్ గరల్స్ హైస్కూల్‌లో హెచ్ఎం వై.ప్రభాకరశాస్త్రి ఆధ్వర్యంలో యోగా దినోత్సవం నిర్వహించారు. స్థానిక అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యోగా డే నిర్వహించారు. విద్యార్థులతో యోగాసనాలు చేయించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి రాజరాజేశ్వరి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని ప్రేమ్ నిరంతర్ గురూజీ (నాన్న) ఆధ్వర్యంలో పట్టణంలో యోగా దినోత్సవం నిర్వహించారు. అనంతరం స్థానిక గాంధీబొమ్మల సెంటర్ నుంచి యడ్ల బజారు సెంటర్ వరకూ యోగాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.

నరసాపురంలో..

నరసాపురం: అంతర్జాతయ యోగా దినోత్సవాన్ని శుక్రవారం నరసాపురంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని వైఎన్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్, మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో యోగా దినోత్సవం నిర్వహించారు. నరసాపురం పదో అదనపు జిల్లా జడ్జి పి.విజయదుర్గ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. యోగా అభ్యసించడం, చరించడం ద్వారా అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని చెప్పారు. యోగాసనాలు వేయడం ఒక అలవాటుగా చేసుకోవాలని సూచించారు. జడ్జి ఆర్.వరలక్ష్మి, కె.శ్రీనివాస్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చల్లా దానయ్యనాయుడు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని శ్రీసూర్య కళాశాలలో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. యోగా ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరూ గుర్తించాలని కళాశాల కరస్పాండెంట్ ఘంటశాల బ్రహ్మాజీ సూచించారు. స్థానిక బీజీబీఎస్ మహిళా కళాశాలలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ నూలి శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ పీఓ కె.రజనీకుమారి ఆధ్వర్యంలో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు.



పాలకొల్లు అర్బన్: లంకలకోడేరు పీహెచ్‌సీలో యోగా చేస్తున్న వైద్య సిబ్బంది



పెనుగొండ: గురుకుల పాఠశాలలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



నరసాపురం రూరల్: అంతర్జాతీయ లేస్ ట్రేడ్ సెంటర్‌లో యోగా దినోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

లంకలకోడేరు పీహెచ్‌సీలో..

పాలకొల్లు అర్బన్: ప్రతి రోజూ యోగా చేయడం వల్ల మానసిక, శారీరక రుగ్మతల నుంచి కాపాడుకోవచ్చని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అడ్డాల ప్రతాప్‌కుమార్ చెప్పారు. మండలంలోని లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. వైద్య సిబ్బంది యోగాసనాలు వేశారు. మెడికల్ ఆఫీసర్ డా.ఎం నవ్యజీవన్, ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, పీహెచ్ఎన్ పి.ఎలిజబెత్, ఫార్మాసిస్టు పీవీ స్వామి తదితరులు పాల్గొన్నారు.

పెనుగొండలో..

పెనుగొండ: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధించవచ్చునని పెనుగొండ సర్పంచ్ నక్కా శ్యామలాసోనీ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా పెనుగొండలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు పలు సూచనలు చేశారు. అలాగే చైతన్య టెక్నో స్కూలులోనూ, భాష్యం పాఠశాలలోనూ, సిద్ధాంతం ఎంపీయూపీ పాఠశాలలోనూ, పెనుగొండ ఎస్వీకేపీ అండ్ డాక్టర్‌కేఎస్ రాజు కళాశాలలోనూ, ఆచంట మండలం లో పలు పాఠశాలల్లో యోగా దినోత్సవం నిర్వహించారు. యోగాసనాల వలన కలిగే ప్రయోజనాలను ఆచంట ఎంపీపీ దిగమర్తి సూర్యకుమారి వివరించారు. కార్యక్రమంలో ఎస్వీకేపీ ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీవీ అప్పారావు, జి.శ్రీనివాస్, జి.బాపిరెడ్డి, టి.దివాకర్, ఆర్ఎస్ శ్రీనివాస్, మీరయ్య, వైస్ ఎంపీపీ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నరసాపురం మండలంలో..

నరసాపురం రూరల్: క్రమం తప్పకుండా యోగాను ఆచరించడం ద్వారా శారీరక, మానసిక ఆలోచనా ధోరణి, మాటల్లో నిజాయితీ అలవడతాయని హస్తకళల ఎగుమతి ప్రోత్సాహక సంస్థ (ఈపీసీహెచ్) ఇండియా–దక్షిణాది రాష్ట్రాల సంచాలకులు కలవకొలను నాగతులసీరావు అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని అంతర్జాతీయ లేస్ ట్రేడ్ సెంటర్‌లో ఘనంగా నిర్వహించారు. ప్రముఖ యోగ గురువు జక్కం బాబ్జి యోగ విశిష్టతను తెలియజేసి, ఆసనాలు, ప్రాణాయామం తదితర క్రియలను చేయించారు. కార్యక్రమంలో లేస్‌సభ్యులు కలవకొలను రామచంద్రుడు, అడ్డగళ్ల సాయిబాబా, బాబు, మాదాసు గోపాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాలకొల్లు అర్బన్: మండలంలోని లంకలకోడేరు 33/11కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ వెలివెల ఫీడర్‌లో ఓఎన్‌జీసీ వాల్వ్ స్టేషన్ నిర్మాణంలో భాగంగా కొత్తగా విద్యుత్ స్తంభాలు వేసేందుకు శనివారం ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు నరసాపురం సబ్ డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బళ్ల సురేష్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. దగ్గులూరు, బల్లిపాడు, శ్రీలంకపుంత, శివదేవుని చిక్కాల తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

అంగన్‌వాడీ విద్యార్థులకు ప్రీ స్కూల్ సర్టిఫికెట్ల అందజేత



ములపర్రులో అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే నిర్వహిస్తున్న దృశ్యం

పెనుగొండ: ములపర్రు, సోమరాజుచెరువు గ్రామాల్లో ల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఐదు సంవత్సరాలు నిండిన పిల్లలను, ప్రాథమిక పాఠశాలలో చేర్పించడానికి వీలుగా ప్రీ స్కూల్ సర్టిఫికేట్స్ అందించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రూతుకుమారి, ఎం.విజయకుమారి మాట్లాడుతూ మూడు సంవత్సరాలు నిండిన పిల్లలందరినీ అంగన్‌వాడీ ప్రీ స్కూలులో చేర్పించడం వల్ల ఆరోగ్య, శారీరక మేధాపరమైన సంపూర్ణ అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. మూడేళ్లు నిండిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో సోమరాజు చెరువు సర్పంచ్ దంపనబోయిన రూపవతి, భాస్కరరావు, నాగబాబు, రామకృష్ణ, ఎమ్మెస్కే మల్లిక తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా కిట్ల అందజేత

మొగల్తూరు: విద్యార్థులు విద్యతో పాటు ఆటపాటల్లో కూడా ముందుండాలని జెడ్పీటీసీ సభ్యుడు తిరుమాని బాపూజి సూచించారు. మండలంలోని కోమటితిప్ప పంచాయతీ నీటితిప్ప ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు శుక్రవారం విద్యా కానుక కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న కిట్లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులకు పుస్తకాలు, బెల్ట్‌లు, సాక్స్, బ్యాగ్‌లతో కూడిన కిట్లను అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ పడవల సూర్యనారాయణ, వైస్ ఎంపీపీ కవురు సీతామహాలక్ష్మి, సొసైటీ చైర్మన్ అల్లూరి రంగరాజు, నాయకులు రేవు రాంబాబు, కవురు సుబ్రమణ్యం, పైడి రత్నంరాజు తదితరులు పాల్గొన్నారు.

పెనుగొండ: ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నత శిఖరాలు చేరుకోవాలని మండల సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షురాలు దండు పద్మావతి అన్నారు. శుక్రవారం ఇలపర్రులో విద్యార్థులకు విద్యా కానుక కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు పడపట్ల పద్మ నాగేశ్వరి, ఉప సర్పంచ్ పిల్లి దుర్గారావు, టీడీపీ నాయకులు కేతా సత్తిబాబు, వెలిచేటి బాబూరాజేంద్ర ప్రసాద్, హెచ్ఎం దొమ్మేటి రాంబాబు తదితరులు పాల్గొన్నారు. అలాగే సిద్ధాంతంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం సర్పంచ్ చింతపల్లి గనిరాజు(చంటి) విద్యా కానుక కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు చిన్నం ఏడుకొండలు, గుత్తుల సత్యవతి పాల్గొన్నారు.



మొగల్తూరు: నీటితిప్ప ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు కిట్లు పంపిణీ చేస్తున్న నాయకులు



పెనుగొండ: ఇలపర్రులో విద్యార్థులకు కిట్లు పంపిణీ చేస్తున్న నాయకులు



యలమంచిలి: మేడపాడులో విద్యార్థులకు పుస్తకాల కిట్లను అందిస్తున్న నాయకులు

మేడపాడులో..

యలమంచిలి: మండలంలోని మేడపాడు హైస్కూల్‌లో చదువుతున్న విద్యార్థులకు వచ్చిన పుస్తకాల కిట్‌లను శుక్రవారం సర్పంచ్ గంటా శాంతకుమారి, ఎంపీటీసీ సభ్యురాలు డేగల సూర్యప్రభ వెంకటేశ్వరరావు పంపిణీ చేశారు. పాఠశాలలో చదువుతున్న 203 మంది విద్యార్థులకు కిట్‌లు వచ్చాయని హెచ్ఎం డి.ప్రసాద్ చెప్పారు. విద్యార్థులందరికీ పంపిణీ చేస్తామని ఆయన వివరించారు.

రెండు గడ్డివాముల దగ్ధం

పాలకొల్లు అర్బన్: మండలంలోని పాలకొల్లు రూరల్ పంచాయతీ పరిధిలోని నాగరాజుపేట, వడ్లవానిపాలెం పంచాయతీ పరిధిలోని గొల్లవానిచెరువులో గురువారం రాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో 20 ఎకరాల రెండు గడ్డివాములు దగ్ధమయ్యాయి. గొల్లవానిచెరువులో ఉప్పలపాటి రాజేష్‌కు చెందిన 10 ఎకరాల గడ్డివాము, నాగరాజుపేటలో కేఎస్ఎన్ రాజుకి చెందిన 10 ఎకరాల గడ్డివామును గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారని సమాచారం అందుకున్న పాలకొల్లు ఫైర్ ఆఫీసర్ వైవీ జానకిరామ్, నరసాపురం ఫైర్ ఆఫీసర్ కె భాస్కరరావు సిబ్బందితో మంటలను అదుపు చేశారు. ఆస్తి నష్టం సుమారు రూ.80 వేలు ఉంటుందని ఫైర్ ఆఫీసర్ జానకిరామ్ విలేకరులకు తెలిపారు. దీనిపై ఎలాంటి ఫిర్యాదులు అందలేదని పోలీసులు తెలిపారు.



గొల్లవానిచెరువులో దగ్ధమవుతున్న గడ్డివాము

ఉపాధి నిధులు విడుదల చేయాలి

పెనుగొండ: గ్రామీణ పేదల, కష్టజీవుల స్థితిగతులను మెరుగుపర్చే విధంగా మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టం ద్వారా పని చేస్తున్న ఉపాధి కూలీలకు సకాలంలో నిధులు విడుదల కాక అనే ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం మండల కమిటీ కార్యదర్శి ఎస్ వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం తామరాడ, దేవ, రామన్నపాలెం, వడలి గ్రామాల్లో ఉపాధి పనులను పరిశీలించి, ఉపాధి కూలీల ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. రెండు నెలలుగా ఉపాధి కూలీలకు వేతనాలు పడలేదన్నారు. మెడికల్ కిట్టులు, కొలతలు వేసేందుకు ఉపయోగించే టేపు గానీ ప్రభుత్వం నుంచి సరఫర లేక కార్మికులే సమకూర్చుకుంటున్నట్లు తెలిపారు. ఇటీవల దేవ గ్రామానికి చెందిన ఉపాధి కూలీ గుడాల లలిత పాము కాటుకు గురై అస్వస్థత పాలైందన్నారు. కాటు తరువాత శారీరక ఇబ్బందులు పడుతుందని, మెరుగైన వైద్యం అందించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సత్వరం ఉపాధి నిధులు విడుదల చేసి ఉపాధి కూలీలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ సంఘ కార్యదర్శి షేక్ పాదుషా తదితరులు పాల్గొన్నారు.



వడలిలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

జంతువులను ప్రేమగా ఆదరించాలి



పెనుగొండ: చెరుకువాడలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో జంతుహక్కుల వారోత్సవాలు నిర్వహిస్తున్న దృశ్యం



మొగల్తూరు: విద్యార్థులతో మాట్లాడుతున్న డాక్టర్ నీలిమ



పాలకొల్లు సెంట్రల్: విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ మల్లేశ్వరరావు

మొగల్తూరు: మూగజీవాలను ప్రేమగా ఆదరించాలని వెటర్నరీ డాక్టర్ నీలిమ సూచించారు. జంతుహక్కుల అవగాహనా వారాన్ని పురస్కరించుకుని శుక్రవారం మొగల్తూరులోని పెన్మెత్స రంగరాజు ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ నీలిమ మాట్లాడుతూ మన ఇంటి పరసరాల్లో ఉండే పశువులు, పక్షులకు నీరు, పండ్లు, చిరుధాన్యాలు అందుబాటులో ఉంచడం ద్వారా వాటి మనుగడకు మేలు చేసిన వారమవుతామన్నారు. ఆరుబయట తిరిగే పశువులకు, పక్షులకు ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడినప్పుడు ఎలా స్పందించాలో? వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వి.రవిశంకర సర్కార్ పాల్గొన్నారు.

పెనుగొండలో..

పెనుగొండ: జంతు హక్కుల వారోత్సవాలను పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం చెరుకువాడలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. పెనుగొండ పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ ప్రమీలా రాణి జంతు హక్కులను పరిరక్షించడం అంటే వారికి ఆకలి, దాహం నుంచి అసౌకర్యం నుంచి, నొప్పి, గాయం, జబ్బులపై విద్యార్థులకు వివరించి చెప్పారు. కార్యక్రమంలో హెచ్ఎం భరణీకుమార్, ఉపాధ్యాయుడు సత్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు.

పాలకొల్లులో..

పాలకొల్లు సెంట్రల్: జంతువులు మనుషులపై ఎంత ప్రేమగా ఉంటాయో మనుషులు కూడా ఆ జంతువులపై అంతే ప్రేమతో మెలగాలని సహాయ సంచాలకులు, ప్రాంతీయ పశువైద్యశాల వైద్యుడు డాక్టర్ జి.మల్లేశ్వరరావు అన్నారు. శుక్రవారం స్థానిక బీవీఆర్ఎం పాఠశాలలో జంతు సంక్షేమం ఓ సామాజిక బాధ్యత వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మల్లేశ్వరరావు మాట్లాడుతూ జంతువులపై దయ, ప్రేమ కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం వై.ప్రభాకరశాస్త్రి, నెస్ట్ సభ్యుడు మనీష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

నరసాపురం: ఆర్టీసీ ప్రయాణీకుల సమస్యల పరిష్కారం కోసం శనివారం డయల్‌యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు నరసాపురం ఆర్టీసీ డిపో మేనేజర్ ఎస్ సుబ్బన్నరెడ్డి చెప్పారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఆర్టీసీ అందిస్తున్న కార్గో సేవలు, డోర్ డెలివరీ సర్వీస్, ప్రత్యేక బస్సులు, వివిధ రూట్లలో కొత్తగా బస్సు సర్వీసులు తదితర అంశాలపై నరసాపురం డిపో పరిధిలోని నరసాపురం, మొగల్తూరు, యలమంచిలి, పాలకొల్లు, పెనుగొండ చుట్టుపక్కల ప్రాంతాల వారు ఫిర్యాదులు, సూచనలు చేయవచ్చని వివరించారు. ఉదయం 11 గంటలు నుంచి 12 గంటలు వరకూ ప్రజలు 99592 25486 నెంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

రైతుల సమష్టి కృషితో కాలువల అభివృద్ధి

కాళ్ల: రైతులు, డిపార్ట్‌మెంట్ సమన్వయంతో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఆదేశాలతో పంట కాలవల అభివృద్ధి పనులు చేస్తున్నట్లు కలవపూడి గ్రామానికి చెందిన రైతు మంతెన పెదనరసింహరాజు తెలిపారు. శుక్రవారం ఆయనతో పాటు కలవపూడి గ్రామానికి చెందిన రైతులు కాలువ అభివృద్ధి పనులను పరిశీలించి విలేకరులతో మాట్లాడారు. పరిమెళ్ల లాకులు వద్ద నుంచి ఏలూరుపాడు శివారు వరకు కాలువలు అస్తవ్యస్తంగా ఉన్నాయని ఇటీవల జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ దృష్టికి తీసుకెళ్లామన్నారు. దీంతో ఆయన స్పందించి సంబంధిత శాఖ, రైతుల సమన్వయంతో నిధిని ఏర్పాటు చేసి కాలువలు అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారని చెప్పారు. దీంట్లో భాగంగా రైతుల పర్యవేక్షణలో తాగు, సాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సుమారు 35 రోజులు పాటు 45 కిలోమీటర్ల మేర కాలువ అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు ఆయన స్పష్టం చేశారు.

అభయాంజనేయ స్వామికి లక్ష తులసి పూజ



సుంకరపాలెంలో అభయాంజనేయస్వామి ఉత్సవ విగ్రహానికి లక్ష తులసి పూజ చేస్తున్న భక్తులు

యలమంచిలి: గుంపర్రు పంచాయతీ సుంకరపాలెంలో ఉన్న శ్రీ వరసిద్ధి వినాయక, సుబ్రహ్మణ్య ప్రయుక్త శ్రీ అభయాంజనేయస్వామి ఆలయ తృతీయ వార్షికోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. మూడు రోజులపాటు నిర్వహించే ఈ ఉత్సవాల్లో ఆలయ అర్చకులు వేదాంతం సుబ్రహ్మణ్యం బ్రహ్మత్వంలో మొదటి రోజు శుక్రవారం ఉదయం సంకల్పం, గణపతి పూజ, పుణ్యాహవచనం, పంచగవ్య ప్రాశన, అభిషేకం, ధ్వజస్తంభ కవచ సంప్రోక్షణ, కుంభాభిషేకం సాయంత్రం లక్ష తులసి పూజ, ఆంజనేయ హోమం, నీరాజన మంత్ర పుష్పాలు, ప్రసాద వితరణ, వేద ఆశీర్వచనం నిర్వహించారు. దంపత సమేతంగా పెద్ద సంఖ్యలో భక్తులు లక్ష తులసి పూజ, ఆంజనేయ హోమంలో కూర్చున్నారు. శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు ఏకాహ భజన, ఆదివారం ఉదయం ఆలయం వద్ద ఉన్న ధ్వజస్తంభానికి గ్రామానికి చెందిన రిటైర్డ్ డీవైఈఓ కొంపెల్ల వెంకట సూర్య సత్యనారాయణమూర్తి సహకారంతో ఇత్తడి కవచం తొడుగుతున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు చెప్పారు. సాయంత్రం స్వామి వారి పల్లకీ ఊరేగింపు రాత్రి అన్నసమారాధన నిర్వహిస్తున్నట్లు వివరించారు. పూజా కార్యక్రమాలన్నీ మానేపల్లి సత్యనారాయణ (చిన్నబాబు) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు.